పేదలకు పట్టాభిషేకం

- 30వేల మందికి ఇళ్ల స్థలాలు
- నిర్మాణ దశలో పదివేల ఇళ్లు
- సొంతింటి కల సాకారం దిశగా అడుగులు



నవరత్నాలు-పేదలందరికీ ఇల్లు పథకంలో నిర్మాణమైన ఇల్లు



నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పథకం కింద కొమరగిరి లే అవుట్ నిర్మిస్తున్న ఇళ్లు

కాకినాడ: ప్రతి ఒక్కరికీ సొంతింటి నిర్మాణం ఓ స్వప్నం. దీనిని సాకారం చేసే దిశగా ప్రభుత్వం వేసిన ముందడుగు సిటీ నియోజకవర్గంలోని 30 వేల మంది పేదలకు వరమైంది. కేవలం పట్టాలు ఇవ్వడమే కాకుండా వాటికి రిజిస్ట్రేషన్లు కూడా చేసి అప్పగించడంతో పాటు ఇళ్ళ నిర్మాణం చేపట్టే దిశగా తీసుకున్న చర్యలు ఎంతో మంది పేద వర్గాల జీవితాల్లో సంతోషాన్ని నింపింది. సిటీ నియోజకవర్గంలో 2019 ఎన్నికల సమయంలో అప్పటి వైఎస్సార్‌సీపీ నేతలు 10వేల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక వాస్తవాన్ని పరిశీలిస్తే 30వేల మంది లబ్ధిదారులు ఉన్నట్టు తేలింది. అయినప్పటికీ ఏ మాత్రం వెనుకడుగు వేయకుండా అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చారు.

650 ఎకరాల్లో స్థలాల పంపిణీ

రాష్ట్రంలోనే అతిపెద్ద లే అవుట్లలో కాకినాడ కొమరగిరి కూడా ఒకటి. ఇక్కడి లబ్ధిదారుల కోసం దాదాపు 650 ఎకరాలను కొనుగోలు చేశారు. కొమరగిరి, ఏపీ త్రయం, చొల్లంగి, ఉప్పాడ కొత్తపల్లి, జి.వేమవరం గ్రామాల్లో దాదాపు 12 లే అవుట్లలో 30 వేల మందికి ఇళ్ల స్థలాలు కూడా ఇచ్చారు. కేవలం స్థలాలు మంజూరు చేసి చేతులు దులుపుకోకుండా చిత్తశుద్ధితో పనిచేయడం ద్వారా దాదాపు రూ.250 కోట్లు వెచ్చించి ఆయా లే అవుట్లను చదును చేసి మౌలిక వసతులు కల్పించి మరో టౌన్‌షిప్‌లుగా అభివృద్ధి చేసేందుకు సంకల్పించారు. ఈ క్రమంలో ఒక్క కొమరగిరి లే అవుట్‌లోనే 10 వేల ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి.

సొంతింటి కల సాకారం



ఎంతోకాలంగా సొంతిల్లు సమకూర్చుకోవాలని ఆశ పడ్డా. అది జీవితంలో సాధ్యమయ్యే పరిస్థితి లేదనిపించింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం స్థలాన్ని కేటాయించి గృహ నిర్మాణాన్ని కూడా చేపట్టడం వల్ల సొంతింటి కల సాకారమైంది. ప్రభుత్వానికి ఎప్పటికీ రుణపడి ఉంటా.

– పితాని సత్య, లబ్ధిదారు, కాకినాడ

అద్దె బాధల నుంచి విముక్తి



సొంతిల్లు లేకపోవడంతో ఎన్నో ఏళ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ఇంటి అద్దెలు చెల్లించలేక ఎన్నో అవస్థలు పడాల్సి వస్తోంది. ఇప్పుడు కొమరగిరిలో చేసిన ఇంటి నిర్మాణం వల్ల మాకంటూ సొంతగూడు ఏర్పడింది. పేదల కష్టాలను అర్థం చేసుకుని గృహాన్ని మంజూరు చేసిన ప్రభుత్వానికి ధన్యవాదాలు

– శీలం వరలక్ష్మి, లబ్ధిదారు, కాకినాడ

టీడీపీ హయాంలో ఒక్క ఇల్లూ లేదు

2014లో అధికారాన్ని చేపట్టిన తెలుగుదేశం పార్టీ ఐదేళ్ల పదవీకాలంలో కాకినాడ సిటీలో ఒక్క ఇల్లు కూడా నిర్మించిన దాఖలాలు లేవు. ఏ ఒక్క లబ్ధిదారునికి సెంటు స్థలం కూడా ఇవ్వలేదు. ఇలాంటి పరిస్థితుల్లో 2019లో అధికారానికి వచ్చాక ప్రస్తుత ప్రభుత్వం ఒకేసారి 30 వేల ఇళ్లపట్టాలు ఇవ్వడంతో ఈ ప్రాంత లబ్ధిదారుల్లో సంతోషం వెల్లివిరుస్తోంది.

నేటి నుంచి ఈవీఎంల కమిషనింగ్



ఏర్పాట్లను కలెక్టర్ నివాస్‌కు వివరిస్తున్న ఆర్వో వెంకటరావు

కాకినాడ: సిటీ నియోజకవర్గంలో పోలింగ్‌కు ఈవీఎంలను సిద్ధం చేసే కమిషనింగ్ ప్రక్రియ ఆదివారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్ శనివారం స్థానిక మెక్లారిన్ గ్రౌండ్స్ ఆవరణలోని ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రం వద్ద పరిశీలించారు. సిటీ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్‌కు వివరించారు. ఎటువంటి సమస్యలు, ఇబ్బందులు లేకుండా ఈ ప్రక్రియను నిర్దేశించిన వ్యవధిలో వేగంగా పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి ఎన్నికల సిబ్బందికి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ పి.సత్యకుమారి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్లు నాయుడు, అనిల్, సర్వేయర్ ఆచార్యులు, ఇతర సిబ్బంది ఉన్నారు.

క్లుప్తంగా

ఎంఈఓగా వేణుగోపాల్



వేణుగోపాల్‌ను అభినందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

కాకినాడ రూరల్: మండల విద్యాశాఖ అధికారిగా బి.వేణుగోపాల్ అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఎంఈఓగా పనిచేసిన ఎల్.గణేష్‌బాబు పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో వచ్చిన వేణుగోపాల్‌కు శనివారం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.ప్రదీప్‌కుమార్, కాకినాడ రూరల్ మండలశాఖ అధ్యక్షుడు కామేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి బాపిరాజు, సీహెచ్.శ్రీనివాస్, మణికుమార్, గంగిశెట్టి తదితరులు అభినందనలు తెలిపారు.

పోస్టల్ బ్యాలెట్‌లో 642 మంది ఓటు

పర్యవేక్షించిన అబ్జర్వర్, ఆర్వో



పోస్టల్ బ్యాలెట్‌ను పరిశీలిస్తున్న పరిశీలకులు గణేష్, ఆర్వో వెంకటరావు

కాకినాడ: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఎన్నికల విధులు నిర్వర్తిస్తూ కాకినాడలో ఓటు హక్కు కలిగిన ఉద్యోగుల కోసం శనివారం పోస్టల్ బ్యాలెట్ నిర్వహించారు. స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పెలిసిటేషన్ సెంటర్‌లో ఈ ప్రక్రియ జరిగింది. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియను ఎన్నికల సాధారణ పరిశీలకులు ఎస్.గణేష్, సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు పర్యవేక్షించారు. తొలిరోజైన శనివారం పీవో, ఏపీవో, బీఎల్‌వోలు, అత్యవసర విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేశారు. 642 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. ఆది, సోమవారాల్లో ఓపీవోలు పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకుంటారని ఆర్వో వెంకటరావు తెలిపారు. ఇతర జిల్లాల్లో ఓటు ఉండి, ఇక్కడ ఎన్నికల విధుల్లో ఉంటూ ఫారం-12 దరఖాస్తు చేసుకుని ఓటర్ల లిస్టులో పేరున్న ఉద్యోగులకు 7, 8 తేదీలలో ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకోవచ్చునని ఆర్వో తెలిపారు. ఇందుకు సంబంధించి సుమారు 4వేల మంది ఓటర్లుగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఏఆర్వో చల్లన్నదొర, ఎలక్షన్ డీటీలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ కార్యవర్గం ఏకగ్రీవం



మోహన్ కుమార్, అధ్యక్షుడు



కుమార్, కార్యదర్శి

బాలాజీచెరువు: కాకినాడ లయన్స్‌క్లబ్ 2024-25 ఏడాదికి నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డైమండ్ జుబ్లీ సెలబ్రేషన్స్ నిర్వహించుకుంటున్న ఈ క్లబ్‌కు అధ్యక్షుడిగా ఎంవీఆర్ మోహన్‌కుమార్, కార్యదర్శిగా పీవీఎస్ఎన్ కుమార్, కోశాధికారిగా నేర్ల మురళీకృష్ణ, డైమండ్ జూబ్లీ చైర్మన్‌గా డాక్టర్ బాదం బాలకృష్ణ నియమితులైయారు. నూతన కార్యవర్గ సభ్యులను రీజనల్ చైర్మన్ మేడిశెట్టి వెంకటరమణ, జోన్ చైర్మన్ దేవత పుత్రారావు అభినందించారు.

హైకోర్టు బార్ ఎన్నికల్లో శేషకుమారి ఎన్నిక



కాకినాడ లీగల్: హైకోర్టు బార్ అసోసియేషన్‌కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎగ్జిక్యూటివ్ సీనియర్ లేడీ మెంబర్‌గా వరుపుల శేషకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శేషకుమారి కాకినాడ బార్ అసోసియేషన్‌లో న్యాయవాది చేస్తూ ఏపీ హైకోర్టులో 15 ఏళ్లగా న్యాయవాదిగా ప్రాక్టీస్ చేసున్నారు. ఏలేశ్వరం మండలం లింగంపర్తి గ్రామానికి చెందిన శేషకుమారి న్యాయవాదిగా కాకినాడ బార్ అసోసియేషన్‌లో చేరారు. కాకినాడ బార్ న్యాయవాదులు ఆమె ఎన్నికపై హర్షం వ్యక్తం చేశారు.

శారీరక వ్యాయామంతో ఆరోగ్యం

బోట్‌క్లబ్: ఆరోగ్యకరమైన జీవనం కోసం శారీరక వ్యాయామం తప్పనిసరని ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అద్దాల సత్యనారాయణ అన్నారు. స్థానిక రంగరాయ వైద్య కళాశాల్లోని టెన్నిస్ మైదానంలో డెంటల్ అసోసియేషన్, కాకినాడ టెన్నిస్ అకాడమీ ఆధ్వర్యంలో శనివారం జాతీయ ఫిట్నెస్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఫిట్‌నెస్ శారీరక ఆరోగ్య ప్రయోజనాలతో పాటు మానసిక ఆరోగ్యంపై సానుకూల ప్రభావాన్ని చూపుతుందన్నారు. ఆందోళన, నిరాశకు చికిత్స చేయడంలో సహాయపడుతుందన్నారు. అనంతరం క్రీడాకారులకు మామిడిపండ్లు పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర, టెన్నిస్ అకాడమీ కోసం పుప్పాల రామ్‌కుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే విజయానికి పునాది



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ద్వారంపూడి

- సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి
- వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

కాకినాడ: గడచిన ఐదేళ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమమే రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి పునాది అని వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక 9వ డివిజన్ గొడారి గుంట ప్రాంతం నుంచి మాజీ కార్పొరేటర్ కంపర బాబి ఆధ్వర్యంలో పలువురు టీడీపీ నుంచి శనివారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. టీడీపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న గంట మంగమ్మ, ములికి సత్యవతి, ఎన్.రామలక్ష్మి, జి.వెంకటలక్ష్మి, ఎన్.వెంకటలక్ష్మి, ఎన్.నూకరత్నంతోపాటు సుమారు 30 మంది మహిళా కార్యకర్తలు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమ పథకాలు సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి చేసిన అభివృద్ధికి ఆకర్షితులై వీరంతా పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే ద్వారంపూడి కండువాలు కప్పి ఆహ్వానించారు.

మీరంతా గర్వపడేలా పనిచేస్తా

- ఎమ్మెల్యేగా గెలిపించండి
- కాకినాడ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల
- 42వ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం



ఎన్నికల ప్రచారంలో భాగంగా వృద్ధురాలిని ఆప్యాయంగా పలకరిస్తున్న కన్నబాబు

కాకినాడ రూరల్: మీరంతా గర్వపడేలా పనిచేస్తానని, ఎమ్మెల్యేగా మరోసారి గెలిపించాలని స్వామినగర్ ప్రజలను వైఎస్సార్ సీపీ కాకినాడ రూరల్ అభ్యర్థి కురసాల కన్నబాబు కోరారు. 42వ డివిజన్ స్వామినగర్, గంగనాపల్లి గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. తొలుత స్వామినగర్‌లో వైఎస్సార్ సీపీ నాయకులు దుర్గాప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు ఘన స్వాగతం పలుకగా గ్రామంలో పలు వీధుల్లో పర్యటించి వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించాలని అభ్యర్థించారు. చిన్నస్వామినగర్‌లో వాటర్ ట్యాంక్ నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. ఐదేళ్లుగా రోడ్లు, డ్రైనేజీలు, మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని, సీఎం జగన్‌కు మరో చాన్స్ ఇవ్వాలన్నారు. చంద్రబాబు అబద్ధాలాడుతున్నారని, ఆయన హామీలు నమ్మవద్దని, 2014లో ఇచ్చిన ఒక్క హామీ అమలు చేయలేదని చెప్పారు. ఎమ్మెల్యేగా గర్వంగా చెప్పుకునేలా నడుచుకుంటానని, జనసేన గాజు గ్లాసు పగిలిపోయిందని, ఫ్యాన్‌స్పీడ్ జోరందుకుందన్నారు. అనంతరం గంగనాపల్లి గ్రామంలో గీసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్‌పై చంద్రబాబు అబద్ధాలు

ల్యాండ్ టైటిలింగ్‌పై చంద్రబాబు అబద్ధాలు ఆడుతున్నారని, అధికారం కోసం ఎంతటి దుర్మార్గానికైనా ఆయన తెగిస్తారనేందుకు ల్యాండ్ టైటిలింగ్‌పై చేస్తున్న అబద్ధాలు, ప్రచారమే నిదర్శనమన్నారు. సీఎం జగన్ భూములు ఇచ్చేవారే కానీ, తీసుకునే వారు కాదని, ల్యాండ్ టైటిలింగ్‌పై తప్పుడు ప్రచారంపై నిష్పక్షపాతంగా విచారణ జరపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు చవ్వాకుల గనిలక్ష్మి, వాసంశెట్టి సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.



స్వామినగర్ ఎన్నికల ప్రచారంలో ప్రసంగిస్తున్న కన్నబాబు

ఆశీర్వదిస్తూ... మద్దతిస్తూ..!





ఎన్నికల ప్రచారంలో ద్వారంపూడి భార్య మహాలక్ష్మి, కుమార్తె డాక్టర్ అంజని

- ద్వారంపూడికి ఓటర్ల సంఘీభావం
- విస్తృతంగా ప్రచారం చేసిన భార్యాబిడ్డలు

కాకినాడ: మాకు ఇళ్ల స్థలాలు ఇచ్చారు.. రిజిస్ట్రేషన్లు చేయించారు.. ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికి తీసుకొచ్చి పింఛన్లు ఇచ్చారు. అనేక సంక్షేమ పథకాలను అందజేస్తున్నారు... మాకు ఇంతకన్నా ఏం కావాలి? వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే ద్వారంపూడికే మా మద్దతు అంటూ అడుగడుగునా ప్రజలు ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డికి సంఘీభావంగా నిలుస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రశేఖర్ రెడ్డి సతీమణి ద్వారంపూడి మహాలక్ష్మి, కుమార్తెలు డాక్టర్ అంజలి, డాక్టర్ ప్రణీత, నగరంలో శనివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. అడుగడుగునా వీరికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. హారతులు ఇచ్చి, పూలమాలలతో సత్కరించారు. ప్రజలే స్వచ్ఛందంగా ముందుకు వచ్చి మా మద్దతు మీకేనని అండగా నిలిచారు.

43వ డివిజన్‌లో

స్థానిక 43వ డివిజన్ దుర్గయ్య తోట, జానకిరామ నగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే సతీమణి మహాలక్ష్మి ప్రచారం చేశారు. గడచిన ఐదేళ్లలో భర్త ద్వారపూడి చంద్రశేఖర్ రెడ్డి చేసిన అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలు పంచారు. చేసిన అభివృద్ధిని చూసి రానున్న ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్, ఎమ్మెల్యే అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డిలను మరోసారి గెలిపించాలని ఆమె ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మాజీ కార్పొరేటర్ జేడీ పవన్ కుమార్, స్థానిక నాయకులు కొకా వెంకటగిరి, జొన్నాడ సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

కుమార్తెల ప్రచారం



ఈవీఎంపై ఓటు ఎలా వేయాలో వివరిస్తున్న డాక్టర్ ప్రణీత

ఎమ్మెల్యే ద్వారంపూడి కుమార్తె డాక్టర్ ప్రణీత పదో డివిజన్ దుమ్ములపేట, తారకరామా నగర్, కోమటి వారివీధి ప్రాంతాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె వెంట రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి సతీమణి మాధురి, స్థానిక నాయకులు వాసుపల్లి కృష్ణ, వాసుపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు. మరో కుమార్తె డాక్టర్ అంజని 33వ డివిజన్‌లో ముమ్మిడి వారి విధి, మాదిరెడ్డి వారి వీధి, ఇబ్రహీం వీధి, ప్రాంతాలలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. టిడిపి, వైయస్సార్సీపి హయాంలో జరిగిన అభివృద్ధి బేరీజు వేసుకొని తండ్రి చంద్రశేఖర్ రెడ్డికి మరో విజయాన్ని అందించాలంటూ ఆమె ఎన్నికల ప్రచారం చేశారు. ఆమె వెంట స్థానిక నాయకులు ఆర్టీవో పెద్ద, పోలిశెట్టి పద్మావతి, కట్టా మంగరాజు, దేవి, రమా తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో నాయకుల ప్రచారం

కరప: రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్‌ను మళ్లీ సీఎంను చేయడాని వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నాయకులు ఓటర్లను అభ్యర్థించారు. శనివారం మండలంలో ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబును, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను గెలిపించాలని అభ్యర్థించారు. వలసపాకలలో ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సర్పంచ్ వాసంశెట్టి రామారావు, ఉప సర్పంచ్ చాట్ర శ్రీను తదితరులు, ఉప్పలంకలో వైఎస్సార్ సీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బొమ్మిడి సతీష్, సర్పంచ్ బొమ్మిడి నయోమి పార్టీ కార్యకర్తలతో ఈ ప్రచారాల్లో పాల్గొన్నారు.



వలసపాకలలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎంపీపీ, సర్పంచ్‌లు

గణపతి పీఠంలో జపయజ్ఞ పారాయణ



శ్రీవారి జపయజ్ఞ పారాయణ నిర్వహిస్తున్న భక్తులు

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని స్వయంభు భోగిగణపతి పీఠంలో శనివారం ఉదయం సుప్రభాత వేళలో శ్రీవారి గోవింద నామాల సంకీర్తనతో 28వ జపయజ్ఞ పారాయణ నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్తయిదువులకు పసుపు కుంకుమ గాజులు పంపిణీ చేశారు. పీఠం ఉపాసకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ తిరుమలపై శ్రీవారి పాదాలు దర్శించడం వల్ల సర్వపాపాలు దూరమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

జగన్ పాలనలోనే బ్రాహ్మణుల సంక్షేమం

- చంద్రబాబు హయాంలో పూర్తిగా నిర్లక్ష్యం
- కార్పొరేషన్ డైరెక్టర్ మంగళంపల్లి అంజిబాబు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మంగళంపల్లి అంజిబాబు

కాకినాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే బ్రాహ్మణులకు అన్ని విధాలా సముచిత ప్రాధాన్యం దక్కిందని బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మంగళంపల్లి అంజిబాబు పేర్కొన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో కరణీకం వ్యవస్థను రద్దు చేయడం వల్ల దాదాపు 28 మంది బ్రాహ్మణులు ఆత్మహత్యలు చేసుకోవలసి వచ్చిందన్నారు. రిటైర్‌మెంట్ వయస్సును తగ్గించడం వల్ల ఎంతో మంది బ్రాహ్మణులు వేదనకు గురై మరణించారన్నారు. వైఎస్సార్ హయాంలో నలుగురికి ఎమ్మెల్యే టిక్కెట్లు, ఒక మంత్రి పదవి కూడా ఇచ్చారని చెప్పారు. జగన్ హయాంలో కూడా ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చి ఓటమి చెందిన వారికి సముచిత స్థానాలు కల్పించారన్నారు. బ్రాహ్మణ పక్షపాతి జగన్ ఎన్నో సంక్షేమ పథకాలు అందించి రాజకీయంగా సముచిత స్థానం కల్పించారన్నారు. బ్రాహ్మణులను విస్మరించిన టీడీపీకి ఎందుకు ఓటు వేయాలని ఆయన నిలదీశారు. టీడీపీ హయాంలో 50 వేల మంది బ్రాహ్మణ లబ్ధిదారులకు రూ.64 కోట్లు ఖర్చు చేస్తే, జగన్ హయాంలో లక్షా 31వేల 594 మంది లబ్ధిదారులకు రూ.308 కోట్లు వెచ్చించి ప్రగతికి తోడ్పడ్డారన్నారు. అందువల్ల రానున్న ఎన్నికల్లో కాకినాడ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు చలమలశెట్టి సునీల్, ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డిలకు బ్రాహ్మణులు మద్దతుగా నిలవాలని కోరారు.

జాకీ షోరూంలో అగ్నిప్రమాదం

కాకినాడ క్రైం: కాకినాడ మెయిన్ రోడ్‌లో జాకీ దుస్తుల దుకాణంలో శనివారం అగ్నిప్రమాదం సంభవించింది. మొదటి అంతస్తులో ఉన్న స్టాక్ రూంలో ప్రమాదం చోటు చేసుకుంది. షార్ట్ సర్క్యూట్ ప్రమాదానికి కారణమని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. సుమారు రూ.10 లక్షల విలువైన లోదుస్తులు, ఉపకరణాలు అగ్నికి ఆహుతయ్యాయని వెల్లడించారు. సమాచారం అందుకున్న సాలిపేట, జగన్నాథపురం ఫైర్ అధికారులు తమ సిబ్బందితో కలిసి గంట పాటు శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు.

కన్నబాబు, సునీల్‌కు ఘన విజయం అందిస్తాం

- ఆత్మీయ సమావేశంలో ఎస్సీ నేతలు కుమార్‌రాజా, గగారిన్

కాకినాడ రూరల్: వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చేందుకు ఎమ్మెల్యే అభ్యర్థి కురసాల కన్నబాబు, ఎంపీ అభ్యర్థి చలమలశెట్టి సునీల్‌ను అత్యధిక మెజార్టీ గెలిపించుకుని అఖండ విజయం అందిస్తామని ఎస్సీ నాయకులు పేర్కొన్నారు. రమణయ్యపేట వైద్యనగర్‌లో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కన్నబాబు క్యాంపు కార్యాలయం వద్ద శనివారం వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్ రాజా, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టరు జంగా గగారిన్‌ల ఆధ్వర్యంలో నియోజకవర్గ పరిధిలోని ఎస్సీ నాయకులు, ఎస్సీ ప్రజా ప్రతినిధులతో ఆత్మీయ సమావేశం జరిగింది, ఈ సందర్భంగా ఎస్సీలకు కన్నబాబు అత్యధికంగా పదవులు ఇచ్చారని గగారిన్ పేర్కొన్నారు, తనకు ఎస్సీ మాల కార్పొరేషన్ డైరెక్టరు పదవి, బందిలి వీరేషకు వైస్ ఎంపీపీ పదవి, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడిగా అనిల్‌ను నియమించారన్నారు. సామాజిక న్యాయం అంటే చేతల్లో జగన్ చూపారన్నారు, కన్నబాబు కాకినాడ రూరల్‌లో ఎస్సీలకు 18 సామాజిక భవనాలు నిర్మించారన్నారు. అంబేడ్కర్ విగ్రహాలు వద్ద రెస్ట్ షెడ్లు నిర్మించారన్నారు. అంబేడ్కర్ కమ్యూనిటీ హాళ్లు నిర్మించారన్నారు. దళితులను పక్కన కూర్చొబెట్టుకుని సొంత మనిషుల్లా చూసే కన్నబాబును గెలిపించుకుంటామన్నారు. జనసేనకు ఓటు వేయవద్దని, కాకినాడ రూరల్ అభ్యర్థి తనకు కాంగ్రెస్ నుంచి పరిచయమని, ఆయకంటే విద్యవంతుడు, సౌమ్యుడు కన్నబాబు అన్నారు. దళితులకు సేవ చేసిన కన్నబాబు తమకు గొప్ప నాయకుడన్నారు. సమావేశంలో ఎస్సీ నాయకులు ఎస్సీ నాయకులు భీమారావు, నారాయణ, వైస్ ఎంపీపీ బందిలి వీరేష, చెల్లి దేవరాజు, జాషువా గిరి, జీవన్, ఇసుక పట్ల లక్ష్మికుమార్, అనిల్ తదితరులు ప్రసంగించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు శెట్టిబత్తుల కుమార్ రాజా